# నేడు ఖమ్మంకు సిపిఐ ప్రచార జాతా

**-ఇందిరానగర్ పైలాన్ వద్ద సభ**

**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు శతాబ్ది ఉత్సవాల జయప్రదం కోరుతూ బాసరలో ప్రారంభమైన ప్రచార జాతా సోమవారం ఖమ్మంకు రానుంది. ఈనెల 15న నిర్మల్ జిల్లా బాసరలో ఈ యాత్ర ప్రారంభమైంది. నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, మెదక్, నారాయణఖేడ్, వికారాబాద్, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, జనగాం, సూర్యాపేట జిల్లాల్లో పర్యటించిన జాతా కూసుమంచి మండలంలోని పాలేరు వద్ద ఖమ్మం జిల్లాలో ప్రవేశించనుంది. ఈ జాతాకు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలీఉల్లాఖాద్రి, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం కోశాధికారి నరేంద్రకుమార్ నేతృత్వం వహిస్తున్నారు. కూసుమంచి, వరంగల్ క్రాస్ రోడ్డు మీదుగా ఖమ్మంలో జాతా పర్యటించనున్నది. సాయంత్రం నాలుగు గంటలకు ఇందిరా నగర్ సిపిఐ పైలాన్ వద్ద సభ నిర్వహిస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ నేడొక ప్రకటనలో తెలిపారు. సరిహద్దుల వద్ద జాతాకు స్వాగతం పలికేందుకు కమ్యూనిస్టు పార్టీ శ్రేణులను సిద్ధం చేసినట్లు ఆయన తెలిపారు.

www.prajapakshem.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

సోమవారం | 24 | నవంబర్ | 2025 పేజీలు : 7

# పల్లెల్లో పంచాయతీల కాక..!

**-అభ్యర్థుల ఎంపికలో రాజకీయ పార్టీలు**
**-రిజర్వేషన్ల మార్పుతో మారుతున్న సమీకరణలు**
**-బిసికి తగ్గి పెరిగిన జనరల్ స్థానాలు**
**-ఎస్సి, ఎస్టిలు యథాతథం**
**-నూకలంపాడుకు మూడు దశాబ్దాల తర్వాత ఎన్నికలు**






| వరుస సంఖ్య | కేటగిరీ | స్థానాలు |
|---|---|---|
| 1. | ఎస్టి | 171 (29.9 శాతం) |
| 2. | ఎస్సి | 110 (19.3 శాతం) |
| 3. | బిసి | 54 (9.45 శాతం) |
| 4. | జనరల్ | 236 (41.3 శాతం) |
| 5. | మొత్తం | 57 (100 శాతం) |

**ప్రజాపక్షం/ఖమ్మం :** గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి 50 శాతం లోపు రిజర్వేషన్లను ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవోను విడుదల చేయడం వెంటనే రిజర్వేషన్ల ప్రక్రియ కూడా పూర్తి కావడంతో పంచాయతీ ఎన్నికల కాక మొదలైంది. ఆదివారం ఖరారు చేసిన రిజర్వేషన్లలో జనరల్ స్థానాలు గణనీయంగా పెరిగాయి. 50 శాతానికి మిగతా 2లో..

## విశ్వ విద్యాలయ ప్రారంభోత్సవం చారిత్రాత్మక ఘట్టం



**-డిసెంబర్ 2న ముఖ్యమంత్రి చే ప్రారంభం**
**-పరిశీలించిన మంత్రి తుమ్మల, శాసన సభ్యులు, అధికారులు**

2 లో

## నేడు కొత్తగూడెంలో ఇందిరమ్మ చీరల పంపిణీ

**-హాజరుకానున్న కూనంనేని**



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం కొత్తగూడెం నియోజక వర్గంలో వివిధ ప్రాంతాల్లో సోమవారం జరగనుంది. కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం మూడు గంటలకు పాల్వంచ మున్సిపల్ కార్యాలయం వద్ద చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. సాయంత్రం నాలుగు గంటలకు చుంచుపల్లి, లక్ష్మి దేవిపల్లి మండలాలకు చెందిన మహిళలకు చుంచుపల్లిలోని కమ్మవారి కళ్యాణ వేదికలోనూ, సాయంత్రం ఐదు గంటలకు సుజాతనగర్‌లోని రైతు వేదికలో సుజాతనగర్ మండల మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమంలో కూనంనేని పాల్గొననున్నారు.

మన యోధులు -3

## మహనీయుడు మన రజబ్అలీ



ఆయన జన్మించింది రైతు కుటుంబం. చదివింది పదవ తరగతి కానీ సమాజం పట్ల ఒక అవగాహన కలిగిన మహోన్నతుడు. ఉపాధ్యాయునిగా పని చేసి ఆ తర్వాత తెలుగు, ఉర్దూ అనువాదకునిగా ప్రభుత్వ ప్రెస్‌లో పనిచేస్తూ గ్రామీణ పరిస్థితులను అధ్యయనం చేశాడు. తిరిగి గ్రామ కరణంగా స్వగ్రామంలో వృత్తిని ప్రారంభించాడు. కరణంగా పనిచేస్తున్నప్పుడే గ్రామాల్లో నాటి నిజాం ప్రభుత్వం నిర్బంధాలు, దారుణాలను చూసి చలించిపోయాడు. ఆంధ్ర మహాసభ కార్యక్రమాలకు ఆకర్షితుడై ఆ తర్వాత కమ్యూనిస్టు పార్టీలో చేరి అంచలంచెలుగా ఎదిగి ఆరు సార్లు శాసనసభ్యునిగా భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర అగ్ర నాయకుల్లో ఒకరిగా ఎదిగిన మహనీయుడు మన రజబ్అలీ. మచ్చలేని రాజకీయ నేతగా గిరిజనుల అభ్యున్నతికై నిరంతరం శ్రమించి లంబాడోళ్ల రాందాస్‌గా కీర్తి ఘడించిన మహ్మద్ రజబ్అలీ ప్రస్తుత రఘునాథపాలెం మండలంలోని పాపటపల్లి గ్రామంలో 1920 జనవరి ఒకటిన జన్మించాడు. మిగతా 2లో..

# పల్లెల్లో పంచాయతీల కాక..!

(మొదటిపేజీ తరువాయి)




రిజర్వేషన్‌ను కుదించడంతో మొత్తం 571 పంచాయతీలలో 236 స్థానాలు జనరల్‌కు కేటాయించారు. ఎస్టీలకు 171, ఎస్సీలకు 110, బిసిలకు 54 సర్పంచ్ స్థానాలను కేటాయించారు. కారేపల్లి, ఏన్కూరు, కామేపల్లి మొదలైన కొన్ని ఏజెన్సీ మండలాలు ఉండడంతో ఎస్టి సర్పంచుల స్థానాల సంఖ్య ఎక్కువగా ఉంది. ఎస్టి మహిళలకు 48, ఎస్టి జనరల్‌కు 51 వంద శాతం ఎస్టీలు ఉన్న గ్రామ పంచాయతీల్లో మూడు మహిళలకు, ఎనిమిది ఎస్టి జనరల్‌కు కేటాయించారు. ఎస్సి మహిళలకు 48, ఎస్టి జనరల్‌కు 62 కేటాయించగా బిసి మహిళలకు 24, బిసి జనరల్‌కు 30 స్థానాలు కేటాయించారు. మొత్తం 236 జనరల్ స్థానాల్లో 112 మహిళలకు కేటాయించారు. ఇదే రీతిలో వార్డులను కూడా రొటేషన్ పద్ధతిలో రిజర్వేషన్లను కేటాయిస్తూ అధికారులు ప్రకటన విడుదల చేశారు. దాదాపుగా పంచాయతీలు, వార్డుల్లోనూ రొటేషన్ పద్ధతిని పాటించారు. రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తి కావడంతో అభ్యర్థుల ఎంపికలో రాజకీయ పార్టీలు తలమునకలవుతున్నాయి. రిజర్వేషన్లకు అనుగుణంగా అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో ఉన్నాయి. గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఎంపిటిసి, జెడ్పిటిసి, పంచాయతీ ఎన్నికలు ఒకేసారి రాగా అప్పట్లో రాజకీయ పార్టీల మధ్య గ్రామాల్లో వివిధ వర్గాల మధ్య ఒక పొందిక కుదిరింది. ఒకరు ఎంపిటిసి, ఒకరు సర్పంచ్ అనే పొందిక వచ్చింది. ఇప్పుడు కేవలం సర్పంచ్ ఎన్నికలు మాత్రమే రావడంతో పొందికలు గత ఒప్పందాల్లో తేడాలొస్తున్నట్లు భావిస్తున్నారు. రిజర్వేషన్లు కూడా మార్పు రావడంతో పోటీ చేయాలనుకునే వారి విషయంలోనూ మార్పులు వచ్చాయి. వార్డులకు సంబంధించి, పంచాయతీలకు సంబంధించి రిజర్వేషన్ల ప్రక్రియపై కొందరు పెదవి విరుస్తున్నారు. కొన్ని వార్డుల్లో ఓటర్లు లేని వర్గాలకు రిజర్వేషన్లు కేటాయించారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఒక కొత్త జోష్ మొదలైంది. సహజంగా స్థానిక ఎన్నికలంటేనే ఉత్సుకత ఎక్కువగా ఉంటుంది. 2024 జనవరి 30 నాటికి పంచాయతీల పదవి కాలం ముగియగా దాదాపు 22 మాసాల తర్వాత పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలనుకున్న అభ్యర్థులు ఆర్థికంగా ఖర్చు చేయక తప్పని పరిస్థితుల్లో కొందరు ఆర్థిక వనరులను సమీకరించుకుంటున్నారు. ఓటర్లను సైతం తృప్తిపరిస్తే తప్ప ఓటు వేసే పరిస్థితి లేకపోవడంతో ఖర్చు చేయక తప్పనిస్థితి ఏర్పడింది. రాజకీయ పార్టీలు స్థానికంగా ఆయా గ్రామ పంచాయతీల వారీగా పొత్తులు కుదుర్చుకుంటున్నాయి.

**నూకలంపాడులో ఈ దఫా ఎన్నికలు...**

మూడు దశాబ్దాల తర్వాత ఆ గ్రామ పంచాయతీకి ఎన్నికలు జరగనున్నాయి. మండలం మొత్తం పూర్తి ఏజెన్సీలో ఉండడం ఆ గ్రామంలో ఎస్టీలు లేకపోవడంతో మూడు దశాబ్దాలుగా గ్రామ పంచాయతీకి ఎన్నికలు జరగడం లేదు. మొత్తం ఎనిమిది వార్డులు ఉండగా కేవలం నాలుగు వార్డులకు మాత్రమే ఎన్నికలు జరుగుతున్నాయి. అందులో నుండి ఒకరిని ఉప సర్పంచ్‌గా ఎన్నుకుని గ్రామ పంచాయతీ పాలన నిర్వహిస్తున్నారు. ఏన్కూరు మండలంలో గల నూకలంపాడు పంచాయతీలో మొత్తం 1100లకు పైగా ఓటర్లు ఉన్నారు. మూడు దశాబ్దాలుగా ఎస్టి ఓటరు లేని ఈ గ్రామ పంచాయతీలో తొలిసారి ముగ్గురు ఎస్టి ఓటర్లు నమోదయ్యారు. ఇప్పటికి కూడా రెండు వార్డులకు ఎన్నికలు జరిగే అవకాశం లేదు. చివరి సారిగా ఈ గ్రామ పంచాయతీ నుండి గద్దె సీతారామయ్య సర్పంచ్‌గా పని చేశారు. ఎట్టకేలకు ఈ దఫా పంచాయతీ ఎన్నికలు ఆ గ్రామంలో జరిగే అవకాశం ఏర్పడింది.

# మహనీయుడు మన రజబ్‌అలీ

(మొదటిపేజీ తరువాయి)

**విద్య - ఉద్యోగం...**



ప్రాథమిక విద్యను రజబ్‌అలీ స్వగ్రామంలో అభ్యసించాడు. ఆ తర్వాత ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్‌లో విద్యను అభ్యసించిన తర్వాత చదువు చాలించి ప్రస్తుత కామేపల్లి మండలం ఊట్కూరు గ్రామంలో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా చేరి ఓ సంవత్సరం కాలం పాటు పని చేశారు. ఆ తర్వాత ఉపాధ్యాయ వృత్తిని వదిలి హైదరాబాద్‌లో ప్రభుత్వ ప్రెస్‌లో తెలుగు, ఉర్దూ అనువాదకునిగా పనిచేశారు. అందులోనూ స్థిరపడకుండా తిరిగి పాపటపల్లి చేరుకుని గ్రామ కరణంగా పనిచేశారు. కరణంగా పనిచేస్తున్నప్పుడే ఆంధ్రమహాసభ పట్ల ఆకర్షితుడయ్యాడు. మచ్చా వీరయ్య తదితరుల నేతృత్వంలో ఆంధ్ర మహాసభలో చేరాడు. 1944లో ఖమ్మంలో ఆంధ్ర మహాసభ జరిగినప్పుడు తన 24వ యేటా ఆంధ్ర మహాసభలో తొలిసారి పాల్గొన్నాడు. ఆ తర్వాత తుదిశ్వాస వరకు ప్రజల పక్షాన పనిచేశారు.

**జైలు జీవితం - పోరాటాలు...**

కరణంగా పనిచేస్తూ ఆంధ్ర మహాసభకు సహకరిస్తున్నాడనే నేపంతో నిజాం ప్రభుత్వం ఆయనను అరెస్టు చేసి మూడున్నర ఏళ్ల పాటు వివిధ జైళ్లలో బంధించింది. ఆ తర్వాత 1946లో మరో మారు అరెస్టు చేసి మూడు మాసాల పాటు వరంగల్ జైలులో బంధించింది. 1947లో కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించిన రజబ్‌అలీని అరెస్టు చేసి మూడు సంవత్సరాల మూడు మాసాల పాటు వరంగల్ , చంచల్‌గూడ జైల్లలో నిర్బంధించారు. ఆ సమయంలోనే ఆయనకు క్షయ వ్యాధి సోకింది. 1952లో జరిగిన తొలిసారి ఎన్నికల్లో ఖమ్మం నియోజక వర్గ బాధ్యతలను స్వీకరించారు. ఆయన తుదిశ్వాస వరకు ప్రజా పోరాటాల్లోనే ఉన్నారు. నందికొండ సాధనోద్యమంలో ఆయన కీలక భూమిక పోషించారు. 1955లో జగ్గయ్యపేటలో జరిగిన రైతు యాత్రకు ఆయన నేతృత్వం వహించారు. కౌలుదారి హక్కుల పోరాటం కోసం జరిగిన పోరాటంలో రజబ్ అలీ ముందు వరుసలో నిలిచారు. బంజి పట్టాల ఉద్యమంలోనూ ఆయన పాత్ర వెలకట్టలేనిది. గ్రామాల అభివృద్ధి, కమ్యూనిస్టు పార్టీ విస్తృతికి కృషి చేశారు. 1967, 1969 ప్రాంతాల్లో జరిగిన ప్రత్యేక ఆంధ్ర, ప్రత్యేక తెలంగాణ ఉద్యమాలకు వ్యతిరేకంగా రజబ్‌అలీ నిలిచారు.

**పార్టీ చీలిక - రజబ్‌అలీ...**

1964లో కమ్యూనిస్టు ఉద్యమం చీలిన సమయంలో రజబ్‌అలీ సిపిఎం వైపు వెళ్లారు. కొద్ది రోజులకే ఆయన తిరిగి సిపిఐలో చేరారు. సిపిఎం విధానాలను విభేదించిన ఆయన సిపిఐలో చేరక ముందే సిపిఐ గుర్తు కంకి కొడవలిపై 1967లో ఖమ్మం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 1972లో ఆయన వందలాది మంది తన సహచరులతో ఇప్పటి కొణిజర్ల మండలం అమ్మపాలెంలో జరిగిన సభలో సిపిఐలో చేరాడు. తాలూకా కార్యదర్శిగా ఎన్నికయ్యారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శిగా భూ పోరాటాలకు ఆయన నేతృత్వం వహించారు. 1970, 1980 దశకాల్లో జరిగిన భూ పోరాటంలో వేలాది ఎకరాల భూమి పేదలకు దక్కడానికి రజబ్‌అలీ చేసిన పోరాటం కారణమైంది. కమ్యూనిస్టు పార్టీ శాసన సభ పక్షనేతగా, ఉప నాయకునిగా, విప్‌గా, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్‌గా వివిధ బాధ్యతల్లో రజబ్ అలీ పనిచేశారు. ముఖ్యంగా గిరిజన అభ్యున్నతికి నిరంతరం కృషి లంబాడోళ్ల రాందాస్‌గా కీర్తించబడ్డారు.

**శాసన సభ్యునిగా...**

శాసన సభ్యునిగా సుదీర్ఘ కాలం పనిచేసి ఉమ్మడి ఖమ్మంజిల్లాలో తన కంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్నారు. ఖమ్మం నియోజక వర్గం నుంచి 1967లో తొలిసారి పోటీ చేసిన రజబ్‌అలీ విజయం సాధించారు. అంతకు ముందు ఈ స్థానం నుంచి నల్లమల గిరిప్రసాద్ 1962లో గెలుపొందారు. 1972లో మరోసారి ఖమ్మంనుంచి గెలిచిన రజబ్‌అలీ 1978లో ఎమర్జెన్సీ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఇందిర ప్రభంజనంలో ఆయన ఓటమి చెందారు. 1978లో ఏర్పడిన సుజాతనగర్ నియోజక వర్గం నుంచి 1983లో పోటీ చేసి వరుసగా నాలుగు సార్లు గెలుపొందారు. 1983, 1985, 1989, 1994లో వరుస విజయాలను సాధించారు. ఆరుసార్లు శాసన సభ్యునిగా పనిచేసిన రజబ్‌అలీ నిస్వార్థపరుడిగా పేరొందారు. అఖిల భారత ఉర్దూ సొసైటీ నుంచి 1992లో గులాబ్‌నబీ ఆజాద్ చేతుల మీదుగా పురస్కారం పొందిన రజబ్‌అలీ 1996 ఏప్రిల్ 10వ తేదీన శాసన సభ్యునిగానే పనిచేస్తూ తుదిశ్వాస విడిచారు. అనేక నిర్బంధాలను ఎదుర్కొని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహ్మద్ రజబ్‌అలీ లాంటి ఎందరో త్యాగధనుల కృషితో కమ్యూనిస్టు ఉద్యమం బలోపేతమైంది. పార్టీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా మహనీయులను తలచుకుని భవిష్యత్తు పోరాటాలకు పునరంకితమవుదాం.

-ప్రజాపక్షం/ఖమ్మం

## విశ్వ విద్యాలయ ప్రారంభోత్సవం చారిత్రాత్మక ఘట్టం



ప్రజాపక్షం/ఖమ్మం : ఉమ్మడి ఖమ్మంజిల్లాలో డా॥ మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ విశ్వ విద్యాలయం ప్రారంభోత్సవం ఒక చారిత్రాత్మక ఘట్టమని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చే నెల రెండవ తేదీన యూనివర్సిటీని ప్రారంభించనున్నారని ఆయన తెలిపారు. ఆదివారం మంత్రి తుమ్మల, శాసన సభ్యులు ఆదినారాయణ, వెంకట్రావు, కోరం కనకయ్య, రాందాస్ నాయక్ లతో పాటు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఇతర అధికారులతో కలిసి యూనివర్సిటీ ప్రారంభోత్సవ కార్యక్రమాలను పరిశీలించారు. వేదిక సహా అన్నింటిని పరిశీలించిన మంత్రి తుమ్మల అధికారులకు పలు సూచనలు చేశారు. భద్రతా వ్యవస్థకు సంబంధించి ఎటువంటి లోపాలు లేకుండా పని చేయాలని ఆయన సూచించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటి వరకు ఎక్కడ లేనివిధంగా ఒక ప్రత్యేకమైన సబ్జెక్టులతో కూడిన యూనివర్సిటీని తెలంగాణ ప్రభుత్వం స్థాపిస్తుందని ఆయన తెలిపారు. 1996లో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల స్థాపనకు కృషి చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సాధారణ విశ్వ విద్యాలయాలకు భిన్నంగా సహజ వనరులు, భూగోళ శాస్త్రాలు, ఖనిజ పరిశోధనలకు ఉపయోగపడడంతో పాటు దేశ భవిష్యత్తుకు దోహదం చేసేవిధంగా ప్రత్యేక విశ్వ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి భావించారని అందుకు అనుగుణంగానే మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ రూపుదిద్దుకుందన్నారు. అధికారులు ఇచ్చిన ప్రతిపాదనలను ఆరు నెలల పాటు పరిశీలించి నివేదికను తయారు చేయడం జరిగిందన్నారు. ఖనిజ సంపదకు పుట్టినిల్లుగా నిలిచిన కొత్తగూడెంలో ఎర్త్ సైన్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు సరైన ప్రదేశంగా భావించడం జరిగిందని తుమ్మల తెలిపారు. భారత దేశంలో ఆర్థిక సంస్కరణలకు మార్గదర్శకుడైన డా॥ మన్మోహన్ సింగ్ సేవలను గుర్తించి ఆయన పేరును యూనివర్సిటీకి పెట్టడం జరిగిందన్నారు. 390 ఎకరాల్లో ఏర్పాటు చేసే ఈ యూనివర్సిటీ ప్రపంచ స్థాయి యూనివర్సిటీగా నిలవనుందన్నారు. డిసెంబర్ రెండున భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు తుమ్మల తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లేబర్ కోడ్‌లను వ్యతిరేకించిన జాతీయ సంఘాలు

**-జిఎం కార్యాలయం ఎదుట నిరసన**



ప్రజాపక్షం/ఖమ్మం : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను సింగరేణిలోని జాతీయ కార్మిక సంఘాలు వ్యతిరేకించాయి. లేబర్ కోడ్‌లను నిరసిస్తూ ఆదివారం జిఎం కార్యాలయం ఎదుట నిరసన తెలియజేసి వెంటనే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐటియుసి కేంద్ర కార్యదర్శి వంగా వెంకట్ మాట్లాడుతూ కార్మికులకు నష్టం కలిగించే లేబర్ కోడ్‌లను మోదీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందని వీటిని వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనేక దశాబ్దాల పాటు పోరాడి సాధించుకున్న హక్కులను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగానే లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చారని తెలిపారు. పని గంటల పెంపు, శ్రమ దోపిడీలో భాగంగా కొత్త చట్టాలను తీసుకు వచ్చారని పెట్టుబడిదారులకు సానుకూలమైన చట్టాలని ఆయన తెలిపారు. 44 చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి అమలు చేయడాన్ని యావత్ కార్మిక లోకం నిరసిస్తుందన్నారు. రద్దు చేయకుంటే ఆందోళన తప్పదని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు రమణమూర్తి, రాము, యరగాని కృష్ణయ్య, ఐఎన్‌టియుసి నాయకులు త్యాగరాజన్, ఆల్బర్ట్, పీతాంబరం, సిఐటియు నాయకులు మందా నర్సింహారావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## బీమా పెంపు, సంక్షేమంపై అవగాహన

ప్రజాపక్షం/ఖమ్మం : భవన నిర్మాణ కార్మికుల బీమా పెంపు, వివిధ సంక్షేమ పథకాల అమలుపై ఈనెల 24న సోమవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కార్మిక శాఖ ఉప కమిషనర్ విజయ్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఖమ్మం త్రీటౌన్ పరిధిలోని మోతె నగర్‌లో టిఎం ఫంక్షన్ హాల్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు. వివిధ కార్మిక సంఘాలు నిర్మాణ రంగ కార్మికులు పాల్గొనాలని కోరారు. బీమా పెంపు, ఇటీవల భవన నిర్మాణ రంగంలోకి వచ్చిన వారి పేర్ల నమోదు, రెన్యువల్, సంక్షేమ పథకాలకు సంబంధించి అవగాహన కల్పించడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# ప్రతి విద్యార్థి ఆదర్శంగా నిలవాలి




-ఎంచుకున్న రంగాల్లో నిష్ణాతులవ్వాలి
-ఎన్‌సిసి డే వేడుకల్లో కలెక్టర్




ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకుని ఇతరులకు ఆదర్శంగా నిలిచేలా ప్రతి విద్యార్థి ఎదగాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఎస్ఆర్అండ్‌బిజిఎన్ఆర్ కళాశాల ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన ఎన్‌సిసి డే వేడుకల్లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు. వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ అద్భుతంగా నృత్య ప్రదర్శనలు చేసిన విద్యార్థులను అభినందించారు. 20 లక్షలకు పైగా యువత సభ్యత్వంతో ఎన్‌సిసి పని చేస్తుందని ఇందులో భాగస్వామ్యం కావడం విద్యార్థుల అదృష్టమన్నారు. క్రమశిక్షణ, దేశ గొప్పతనం, దేశానికి మనం ఎలా ఉపయోగపడాలి అనే భావన విద్యార్థుల్లో ఎన్‌సిసి ప్రేరేపిస్తుందని జీవితం ఉత్తమంగా గడిపేందుకు అవసరమైన జీవన నైపుణ్యాలు ఎన్‌సిసి సంస్థ విద్యార్థులకు నేర్పిస్తుందన్నారు. విజయం కోసం మాత్రమే పని చేస్తే మంచి ఫలితాలు రావాలని, మనం చేసే ప్రతి పని అద్భుతంగా చేసినప్పుడే విజవంతమవుతామన్నారు. వైఫల్యాలు లేకుండా గొప్ప స్థానానికి ఎదిగిన వ్యక్తులు మనకు సమాజంలో ఎవరు కనపడరని వైఫల్యాల నుంచి నేర్చుకున్న పాఠాలు సరిచేసుకుంటూ పనిచేస్తే విజయం సాధిస్తామన్నారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం వికసిత్ భారత్ కార్యక్రమం చేపట్టిందని, యువత తమ వద్ద అందుబాటులో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే గొప్ప ఫలితాలు సాధిస్తారన్నారు. విద్యార్థులు చేసిన సామాజిక ప్రదర్శనలు అందరిని ఆలోచింపజేశాయి. దేశభక్తి గీతాలతో చేసిన పలు రకాల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి కమాండెంట్ నవీన్ యాదవ్, ఎస్‌కె భద్ర, పలు విద్యా సంస్థల నిర్వాహకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు పెద్దపీట



ఎమ్మెల్యే మట్టా రాగమయి

ప్రజాపక్షం/సత్తుపల్లి: స్త్రీ లేనిదే మానవజాతి అభివృద్ధి లేదని, మానవ జాతి మనుగడకు, సృష్టి నడవడానికి స్త్రీ కావాలని, మహిళా మూర్తులను గుర్తించి గౌరవించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చీరలను బహుమతిగా అందిస్తున్నారన్నారు సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్. ఆదివారం పట్టణంలోని ఎంఆర్ గార్డెన్ నందు ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా వేంసూరు, పెనుబల్లి, సత్తుపల్లి మండలాల్లోని మహిళలకు సుమారు 36132 చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్, కల్లూరు డివిజన్ సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లు హాజరైనారు. కార్యక్రమంలో మహిళలను ఉద్దేశించి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించిన గొప్ప నాయకుడు రేవంత్ రెడ్డి అని కొనియాడారు. గృహ జ్యోతి పథకం ద్వారా ఉచిత విద్యుత్ ను అందించటమే కాకుండా ఉచిత గ్యాస్, ఇందిరమ్మ ఇండ్లు మహిళలకు అందిస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. మహిళలకు వడ్డీ లేని రుణాలు అందించి మహిళలను లక్షాధికారులను చేస్తుందన్నారు. సిరిసిల్లలోని చేనేత కార్మికుల ద్వారా చీరలను ప్రత్యేకంగా నాణ్యతతో తయారు చేయించి అందిస్తున్న ప్రభుత్వాన్ని మహిళలందరూ ఆదరించాలన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళలు, రైతులు, వృద్ధులు సంతోషంగా ఉన్నారన్నారు. రానున్న పంచాయతీ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మహిళా మణులకు ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి చీరను అందిస్తామని. రాష్ట్రంలోని మహిళల కోసం 3 లక్షల 36,000 చీరలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. ద్వాక్రా వెలుగు గ్రూపుల్లోని ప్రతి ఒక్క మహిళకు చీర బహుమతిగా అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు , కమల్ పాషా, మార్కెట్ కమిటీ చైర్మన్ లు దోమ ఆనంద్ బాబు, భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తోట సుజల రాణి గణేష్ , వార్డ్ కౌన్సిలర్లు కంటే నాగలక్ష్మి, పద్మజ్యోతి రవీందర్ రెడ్డి, ఏపిఎంలు జ్యోతి ప్రసన్న, సుబ్బారావు, కల్పన, డిపిఎంలు ఆంజనేయులు, శ్రీనివాసరావు, వినుకొండ కృష్ణ, పింగుల సామ్యూల్, మానుకోట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



ప్రజాపక్షం/పెనుబల్లి: పెనుబల్లి మండలం లంకపల్లి వద్ద రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. శనివారం రాత్రి లంకపల్లి గ్రామ శివారులో నడుచుకుంటూ రోడ్డు పై వెళుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలానికి విఎం బంజర్ ఎస్ఐ వెంకటేష్ తన సిబ్బందితో మృత దేహాన్ని పెనుబల్లి ప్రభుత్వ మార్చురికి తరలించారు. మృతుడు దగ్గర ప్లాస్టిక్ సంచిలో వున్న చిత్తు కాగితాలు, ఖాళీ డ్రింక్ బాటిల్స్ బట్టి మృతుడు ఇతర రాష్ట్రానికి చెందిన యాచకుడిగా అనుమానిస్తున్నారు.

# సర్పంచుల రిజర్వేషన్ ఖరారు



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి సర్పంచుల స్థానాలకు అధికారులు రిజర్వేషన్లను ఖరారు చేశారు. మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలు ఉండగా వాటిలో సర్పంచ్ స్థానాలకు సంబంధించి ఎస్టిలకు 16, ఎస్సిలకు మూడు, జనరల్‌కు 18 స్థానాలు కేటాయించారు. అదేవిధంగా 308 వార్డుల్లో 160 వార్డులను ఎస్సి, ఎస్టి, బిసిలకు కేటాయించగా 148 వార్డులను జనరల్‌కు కేటాయించారు. గత ఎన్నికల్లో సర్పంచ్ స్థానానికి సంబంధించి రోటేషన్ పద్ధతిలో ఈ ఏడాది రిజర్వేషన్ కల్పించారు. సర్పంచ్ స్థానానికి సంబంధించి ఎస్టి మహిళకు మల్లేపల్లి, కెవి బంజర, జింకలతండా, ఈర్లపూడి, రజబ్‌అలీ నగర్, శివాయిగూడెం, పంగిడి, లచ్చిరాంతండా గ్రామ పంచాయతీలను కేటాయించారు. ఎస్టి జనరల్‌కు వి ఆర్ బంజర, దొనబండ, మంచుకొండ, గణేశ్వరం, జికె బంజర, రాంక్యాతండా, మూలగూడెం, కొర్లబోడు తండా స్థానాలను కేటాయించారు. ఎస్సి మహిళకు బూడిదంపాడు, ఎస్సి జనరల్ రఘునాథపాలెం, కోయచలక గ్రామాలను కేటాయించారు. జనరల్ మహిళకు పాపటపల్లి, చింతగుర్తి, వేపకుంట్ల, రేగుల చలక, మంగ్యాతండా, సూర్యాతండా, ఎన్‌వి బంజర, బావోజీతండా, హర్యాతండా లు కేటాయించారు. జనరల్ స్థానాలకు సంబంధించి చిమ్మపూడి, పువ్వాడ నగర్, కోటపాడు, వి.వెంకటాయపాలెం, తడికలబోడు తండా, బద్యాతండా, చెరువుకొమ్ము తండా, పుటానితండా, రాములు తండా గ్రామ పంచాయతీలు కేటాయించారు. రిజర్వేషన్లు ఖరారు కావడంతో సర్పంచ్ స్థానాలకు పోటీ చేసేందుకు వివిధ పార్టీల నుంచి పలువురు పోటీ పడుతున్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతుండడంతో గ్రామాల్లో సందడి మొదలైంది. రెండు మూడు రోజుల్లో ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల కానున్నట్లు సమాచారం.

## చారిత్రకపోరు సిపిఐదే



ప్రజాపక్షం/కొణిజర్ల : భారత కమ్యూనిస్టుపార్టీ సుదీర్ఘ పోరాటాల ద్వారా లక్షలాది మంది ప్రయోజనాల లక్ష్యంగా పోరాడిన వందేళ్ల ఘనచరిత్ర కలిగిన సిపిఐ మహాసభకు పెద్ద ఎత్తున తరలిరావాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దొండపాటి రమేష్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని గోపారం గ్రామంలో సిపిఐ ఇంటింటి విస్తత ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయను మాట్లాడుతు బిజెపి మోడి ప్రభుత్వంలో వ్యవసాయరంగం తీవ్రమైన సంక్షోభంలో ఉందని తెలిపారు. కేంద్రప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానలపై ఐక్యంగా ఉద్యమించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు జిల్లా వ్యవసాయ కార్మికసంఘం సహాయ కార్యదర్శి పిట్టల రాంబాబు, నాయకులు పిచ్చమ్మ, వెంకటి, ఆశీర్వాదం, భిక్షం, రమేదేవి పాల్గొన్నారు.

## రైతులు రోడ్లపై ధాన్యం ఆరబెట్టవద్దు : ఎస్ఐ



ప్రజాపక్షం/వైరా: రైతులు పండించిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టవద్దని వైరా ఎస్సై పి.రామారావు అన్నారు. ఈ సందర్భంగా ఎస్సై పి.రామారావు మాట్లాడుతూ రైతులకు పలు కీలక సూచనలు జారీ చేశారు. రోడ్లపై ధాన్యం ఆరబెట్టడం వలన పలువురు వాహనదారులకు ప్రమాదకర పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. రోడ్లపై ఆరబోసిన ధాన్యం రాసులపై నల్లని కవర్లు కప్పడం వాటిపై రాళ్లని పెట్టడం వలన రాత్రిపూట వాహనదారులు ముందున్న అడ్డంకి గుర్తించలేక, ప్రమాదాలకు గురవుతున్నారని హెచ్చరించారు. మండలంలో వరి పొలాలు కోసిన రైతులు రోడ్లపై ధాన్యం ఆరబెడుతున్నారని అలా చేయవద్దని అన్నారు. వ్యవసాయ భూములు రోడ్లను ఆనుకొని ఉండటం వలన కొందరు రైతులు రోడ్లపైనే ఆనుకొని ఉండటం వలన కొందరు రైతులు రోడ్లపైనే ధాన్యం ఆరబెడుతున్నారు. ఇది రోడ్డు ప్రయాణీకుల ప్రాణాలకు కలిగించే ప్రమాదం ఉందని అన్నారు. దయచేసి రోడ్లపై ధాన్యం ఆరబెట్టకుండా గ్రామాల్లో ఉన్న ఆరబెట్టే యార్డులు, ఖాళీ ప్రదేశాలు వినియోగించాలని సూచించారు. ప్రజల భద్రత అందరి బాధ్యత అని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు.

## వైరా విద్యుత్‌శాఖ డిఈగా వై.రమేష్



ప్రజాపక్షం/వైరా: వైరా విద్యుత్‌శాఖ డిఈగా వై.రమేష్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఇంచార్జ్ డిఈగా బాధ్యతలు నిర్వహించిన బాబురావు నూతనంగా వచ్చిన డి.రమేష్‌కు బాధ్యతలు అప్పజెప్పారు. మంచుకొండ గ్రామానికి చెందిన వై.రమేష్ కొత్తలింగాలలో ఏడిగా విధులు నిర్వహిస్తూ ప్రమోషన్‌పై వైరా డిఈగా వచ్చారు. ఈ సందర్భంగా పలువురు డిఈ రమేష్‌బాబు రమేష్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వైరా విద్యుత్‌శాఖ డివిజనల్ ఇంజనీర్‌గా పూర్తి బాధ్యతలు స్వీకరించిన రమేష్ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడానికి అదేవిధంగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్.రామారావు, డిఈ ఖమ్మం బి.శ్రీనివాసరావు, డిఈఈ మధిర, వైరా ఏడిఈ పి.కిరణ్‌కుమార్, ఆనంద్ ఏడిఈ, ఏఈలు పి.సుందర్‌కుమార్, పి.వెంకటసాయి,డివిజన్,అకౌంట్ స్టాఫ్, శుభాకాంక్షలు తెలిపారు.

## వైరా ఏసిపిగా శ్రీనివాస్



ప్రజాపక్షం/వైరా: వైరా ఏసిపిగా శ్రీనివాస్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైరా ఏసిపిగా విధులు నిర్వహించి రెహమాన్ పదవీవిరమణ చేసిన తర్వాత కల్లూరు ఏసిపికి అదనపు బాధ్యతలు అప్పజెప్పారు. అయితే ఆదివారం వైరా ఏసిపిగా పూర్తిస్థాయిలో పి.శ్రీనివాస్‌ను కేటాయిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ప్రస్తుతం శ్రీనివాస్ హైదరాబాద్‌లోని జిహెచ్ఎంసిలో డివిస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. నేడు పి.శ్రీనివాస్ వైరా ఏసిపిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

## నూతి సత్యనారాయణకు శుభాకాంక్షలు



ప్రజాపక్షం/వైరా: ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన వైరాకు చెందిన నూతి సత్యనారాయణని ఆదివారం వైరాకు చెందిన నూతి సత్యనారాయణని ఆదివారం జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ నాగేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి అంజని, వైరా నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు పమ్మి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ప్రజాపక్షం/కొణిజర్ల : మండల పరిధిలోని తనికెళ్ల గ్రామంలో 198788 పదోతరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఖమ్మం పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌నందు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. సుమారు నాలుగు దశాబ్దాల తర్వాత కలుసుకున్న వారు చదువుకునేరోజుల్లోని పాతజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వివాహాలు అయినవా, పిల్లలు ఎంతమంది, పిల్లలు ఏఏరంగాల్లో స్థిరపడ్డారు అనేవిషయాలు అడిగి తెలుసుకున్నారు. 43 మంది స్త్రీలు, పురుషులు పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో పదవీవిరమణ పొందిన ప్రధానోపాధ్యాయులు మణిటీచర్, విజయశ్రీ, విజయలక్ష్మి, ఫిజికల్ డైరెక్టర్‌గా రిటైర్డ్ అయిన చెన్నారెడ్డి, ఉపాధ్యాయులు గురువయ్య, పూర్వ విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## సందడిగా మారిన పెద్దమ్మతల్లి దేవాలయం



ప్రజాపక్షం/పాల్వంచ : మండల పరిధి కేశ వాపురం, జగన్నాధపురం గ్రామాల మధ్య న కొలువై ఉన్న ( శ్రీకనకదుర్గ ) పెద్దమ్మతల్లి దే వాలయం ఆదివారం అధిక సంఖ్యలో వచ్చిన భక్తులతో సందడిగా మారింది. భక్తులు అమ్మ వారికి బోనాలు సమర్పించారు. ఒడిబియ్యం, కనుములు, చీరలు తది తర మొ క్కులు చెల్లించుకొన్నారు. అనంతరం ఆలయంలోని శ్రీ అన్నపూర్ణా సమేత విశ్వే శ్వర స్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకము లు నిర్వహించారు. క్యూలైన్‌లో భక్తుల సౌకర్యం కోసం ఉచిత పులిహో వితరణ, మంచినీటి సౌకర్యం కల్పించారు.

బహిరంగ వేలం : దేవాలయంకు చెందిన వివిధ షాపులకు, భక్తులు సమర్పించిన చీరలు, దేవాలయానికి పలు సరుకులు సరఫరా చేసేందుకు లీజుకు సంభింధించి ఈ నెల 25వ, తేదీన ఆలయంలో టెండర్ కం బహిరంగ వేలం నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వాహణా ధికారి ఎన్. రజనీకుమారి తెలిపారు. కావునా ఆసక్తి కలిగిన వారు ఉదయం 11 గంటల లోపు ఆలయానికి వచ్చి నిభంధనల మేరకు వేలం పాటలో పాల్గొనాలని ఆలయ పాలక మండలి సభ్యులు సూచించారు.

## వందేళ్ల సిపిఐ ఉత్సవాలను జయప్రదం చేయండి



ప్రజాపక్షం/జూలూరుపాడు: వంద సంవత్సరాల సిపిఐ ముగింపు ఉత్సవాలను జయ ప్రదం చేయాలని జూలూరు పాడు సిపిఐ మండల కార్య దర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. డిసెంబర్ 26న ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగే వందేళ్ల ముగింపు ఉత్సవాల బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపుని చ్చారు. ఈ దేశ స్వాతంత్ర ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజలను సమీకరించి పోరాటంలో అగ్రభాగాన నిలిచి అనేక త్యాగాలు చేసిన పార్టీ సీపీఐ మాత్రమే, కార్మిక విద్యార్థి రైతు మహిళా వ్యవసాయ కార్మిక యువజన, అనేక ప్రజా సంఘాల నిర్మించి ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటలు నిర్వహించారు. ఈ దశాబ్ద కాలంలో దేశ సమైక్యత కోసం ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ఎన్నో త్యాగాలు ఎంతోమంది అమరవీరుల రక్తా ర్పణంతో ప్రజల కోసం పోరాటలు నిర్వహించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరా టంలో నాలుగున్నర వేల మంది ప్రాణ త్యాగాలతో 3000 గ్రామాలలో భూస్వాముల దొరల ఆగడాల నుంచి ప్రజల విముక్తి కల్పించి భూమిలేని పేదలకు పది లక్షల ఎకరాల భూమిని పంచిన మహత్తర చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ. అని వంద సంవత్సరాల ముగింపు ఉత్సవాల సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో లక్షలాది మందితో బహిరంగ సభ జరు గుతుందని తెలిపారు. దేశం స్వతంత్రం కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఐ నిర్వహించిన పోరాటాలను త్యాగాలను నేటి యువతరానికి గుర్తు చేస్తూ ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగే బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి, ఎస్కే నాగుల్ మీరా, సీపీఐ నాయకులు ఎల్లంకి మధు, సిరిపురపు వెంకటేశ్వర్లు, వల్ల మల్ల సామేలు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యాస రోశయ్య, దేవినేని రాము చలగొండ్ల సతీష్, యల మద్దిసాయి కృష్ణ ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే చాంద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## 26న జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

ప్రజాపక్షం/ములకలపల్లి:



కేంద్ర ప్రభుత్వం అనుసరి స్తున్న కార్మిక కర్షక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 26వ తారీఖున దేశ వ్యాప్తంగా జరగబోయే నిర సన కార్యక్రమాన్ని జయ ప్రదం చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కల్లూరి కిషోర్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ముదిగొండ రాంబాబు, తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నరాటి రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సంయుక్త కిసాన్ మోర్చా సమావేశంలో వారు మాట్లాడుతూ రైతాంగ సమస్యల మీద దేశ వ్యాప్తంగా జరిగిన ఉద్యమం సందర్భంలో కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాత పూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా కనీస మద్దతు ధర స్వామినాథన్ సిఫార్సులు అమలు గ్యారెంటీ చేయాలని, రైతులకు వ్యవసాయ కార్మికులకు సమగ్ర రుణమాఫీ పథకాన్ని ప్రకటించాలని ఇప్పటికే రుణగ్రహీతులైన రైతు లపై చట్ట విరుద్ధ వేధింపులు ఆపి రైతులకు వడ్డీ లేని రుణాన్ని అమలు చేయాలని దీని కోసం ఆర్బిఐ నాబార్డ్‌కి నిధులు కేటాయించాలని కార్మికులకు రక్షణగా ఉన్న కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోర్టులను తెచ్చే ఆలోచన కేంద్ర ప్రభుత్వం మాను కోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మళ్ళీ దేశ వ్యాపిత ఉద్యమం ప్రారంభిస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఊకంటి రవికుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు పోతుగంటి లక్ష్మ ణ్, నకిరేకంటి నాగేశ్వరరావు, అనుమల సాయి, తదితరులు పాల్గొన్నారు.

# డిసిసి అధ్యక్షుడిగా నూతి సత్యనారాయణ

**-భట్టి అన్న బాటలో నూతి**
**-విధేయతకు పట్టం కట్టిన నేతలు**
**-భట్టికి అత్యంత సన్నిహితుడు నూతి**
**-నూతి నియామకం పట్ల వైరాలో సంబరాలు**









ప్రజాపక్షం/వైరా: ఖమ్మం జిల్లా కాంగ్రేస్ అధ్యక్షుడిగా వైరాకు చెందిన సీనియర్ కాంగ్రేస్ నాయకుడు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమా ర్కకు అత్యంత సన్నిహితులు జీవితకాలం భట్టివిక్రమార్క మిత్రుడు, అనుచరుడు అయిన నూతి సత్యనారాయణను ఏసిసి ఆదేశాలతో నియ మించారు. కాంగ్రేస్ పార్టీ చురుకైన నేతగా ఉండి ప్రజా సమస్యలపై భట్టి విక్రమార్క రాజకీయ జీవితం ప్రారంభం నేపద్యంలో రైతుల కోసం భట్టి విక్రమార్క చేస్తున్న పోరాటంలో నూతి సత్యనారాయణ భాగస్వాముల య్యారు. వైరా ప్రాజెక్టుకు నీళ్లు తేవడంలో భట్టివిక్రమార్కతో పాటు ఏన్కూరు మండలం తిమ్మారావుపేట వద్ద లాకులు ఎత్తి సాగునీరు తెచ్చిన సందర్భాల్లో ఉన్నాయి. నూతి సత్యనారాయణ జిల్లా కాంగ్రేస్ అధ్యక్షుడిగా నియామకమైన విషయం తెలుసుకోవడంతో ఒక్కసారిగా వైరా మండలంలో కాంగ్రేస్ శ్రేణుల్లో సంబరాలు నెలకొన్నాయి. నూతి సత్యనారాయణ నియామకం తెలిసిన వెంటనే పెద్ద ఎత్తున ఆదివారం ఆయన నివాసానికి కాంగ్రేస్ శ్రేణులు తరలివెళ్లి శుభాకాంక్షలు తెలి పారు. నూతి సత్యనారాయణ జిల్లా కాంగ్రేస్ అధ్యక్షుడిగా నియమితు లైన సందర్భంగా ప్రజాపక్షం దినపత్రికతో ఆయన పట్ల ప్రత్యేక అనుభవాన్ని పంచుకు న్నారు. కాంగ్రేస్ పార్టీ కోసం ఆనాడే నూతి సత్యనారాయణ ప్రభుత్వ ఉద్యోగాన్ని వదిలేసి మూడు రంగుల జెండా బాట పట్టాడు. ఆనాడు నూతి సత్యనా రాయణ చేతపట్టిన జెండా నేడు జిల్లా కాంగ్రేస్ అధ్యక్షుల వరకు తీసుకెళ్లింది. కాంగ్రేస్ పార్టీ చెప్పిన మాట ప్రకారమే బిసి సామాజిక వర్గానికి పెద్ద పీత వేసే విధంగా నూతి సత్యనారాయణ నియామయాన్ని చేపట్టింది. దీంతో జిల్లావ్యా ప్తంగా బిసి కులాల్లో కాంగ్రేస్ పట్ల గౌరవం పెరిగిందనే చెప్పవచ్చును.

### నూతి సత్యనారాయణ రాజకీయ ప్రస్తానం...

1986 నుండి మల్లు భట్టివిక్రమార్క, పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, వెంకటేశ్వ రరావుతో పాటు నూతి సత్యనారాయణ, అతని స్నేహితులు అందరూ కలిసి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాంగ్రేస్ మిత్ర మండలి ఏర్పాటు చేశారు. అప్పట్లో బలంగా ఉన్న సిపిఎం పార్టీకి ధీటుగా నిల బడి సొసైటీ ఎన్నికల్లో సైతం పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. పువ్వాళ్ల దుర్గాప్రసాద్ సొసైటీ అధ్యక్షుడిగా విజయం సాధించిన తర్వాత మల్లు భట్టివిక్రమార్క ఆధ్వర్యంలో కాంగ్రేస్ అభివృద్ధి కోసం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున పోరాటాలు చేశారు.

### భట్టివిక్రమార్క పాదయాత్రలో వెన్నంటి ఉన్న నూతి...

కాంగ్రేస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు భట్టివిక్రమార్క, ప్రజా సమస్యల కోసం చేపట్టిన పదయాత్రలో భట్టి ప్రక్కనే ఉంటూ పాదయత్రలో కొనసాగుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా భట్టీ చేపట్టిన యాత్రను ప్రజలకు వివరిస్తూ ముందుకు నడిచాడు. నూతి సత్యనారాయణ ఊహ తెలిసిన నాటి నుండి భట్టివిక్రమార్కతోనే ఆయన రాజకీయ ప్రస్థానం నేటి వరకు భట్టితోనే కొనసాగుతుంది.

### సత్యనారాయణకు పలువురి అభినందనలు...

ఖమ్మం జిల్లా కాంగ్రేస్ అధ్యక్షుడిగా నియమితులైన నూతి సత్యనారాయ ణకు ఆదివారం అన్ని వర్గాల ప్రజలు, కాంగ్రేస్ నాయకులు పెద్ద ఎత్తున నూతి సత్యనారాయణ నివాసానికి వెళ్లి పుష్పగుచ్చం అందజేసి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. దీంతో ఒక్కసారిగా వైరా వాసికి మరో సారి జిల్లా కాంగ్రేస్ అధ్యక్షుడిగా ఎంపిక చేయడం పట్ల వైరాలో పలు వురు కాంగ్రేస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు.

# మహిళా సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**ఇందిరమ్మ చీరల పంపిణీలో ఎమ్మెల్యే పాయం**



ప్రజాపక్షం/కరకగూడెం: కరకగూడెం మండల కేంద్రంలోని తహశీ ల్దార్ కార్యాలయం నందు తెలంగాణ రాష్ట్రం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అర్హులైనటువంటి ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరల అందజేయాలని నిర్ణ యించిన సందర్భంగా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ఆది వారం పినపాక శాసనసభ్యులు శ్రీ పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సాధికా రతే లక్ష్యంగా కాంగ్రేస్ ప్రభుత్వం పని చేస్తుందని, అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మహిళా సంక్షేమానికి కాంగ్రేస్ ప్రభుత్వం తీసు కుంటున్న చర్యలను గుర్తు చేస్తూ మహిళలు ఆర్థికంగా స్థిరపడేందుకు దోహదపడే విధంగా అమలవుతున్నటువంటి పథకాలను వివరిస్తూ మహాలక్ష్మి పథకం ద్వారా మహిళల పేరుమీద ఇందిరమ్మ ఇంటి నిర్మా ణానికి ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం, ఉచిత బస్సు ప్రయాణం, గృహ జ్యోతి పథకం ద్వారా 200 యూనిట్లు కరెంటు ఫ్రీ, 500 కి గ్యాస్ సిలిండర్, మహిళా సంఘాలకు ఆర్థిక బలం కల్పించే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. పంపిణీ కార్యక్రమాన్ని దశలవారీగా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నవంబర్ 19 నుంచి డిసెంబర్ 9 వరకూ మొదటి దశ, పట్టణ ప్రాంతాల్లో మార్చి 1 నుంచి 9 వరకూ రెండో దశగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ యొక్క కార్యక్రమంలో తహశీల్దార్ కాంతారావు, ఎంపిఓ మారుతి ప్రభుత్వ అధికారులు, మండల అధ్య క్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, కాంగ్రేస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరం : రాగమయి



ప్రజాపక్షం/సత్తుపల్లి: ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వర మని తెలిపారు సత్తుపల్లి శాసనసభ్యులు డా. మట్టా రాగమయి దయా నంద్ విజయ్ కుమార్. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం సత్తుపల్లి, పెనుబల్లి, వేంసూరు మండలాలకు చెందిన సుమారు 113 మంది ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులకు మంజూరైన రూ. 38,01,000 లను ఆదివారం ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వివిధ అనారోగ్య పరిస్థితులతో ఆసుప త్రుల పాలై వైద్యం నిర్వహించుకుని ఆర్థికంగా చితికిపోయిన వారిని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. అనారోగ్యాల పాలై , ఆర్థికంగా చితికిపోయిన వారిని ఆదుకుంటున్న ప్రభుత్వానికి అందరూ అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజా చౌదరి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తోటా సుజలరాణి, కౌన్సిలర్లు కంటే నాగలక్ష్మి, పద్మజ్యోతి, కాంగ్రేస్ నాయకులు మానుకోట ప్రసాద్, కాంతారావు పాల్గొన్నారు.

# పేదల పాలిట పెన్నిధి కాంగ్రెస్ ప్రభుత్వం

**-ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీలో పాయం**





ప్రజాపక్షం/అశ్వాపురం: పేదల పాలిట పెన్నిధి కాంగ్రేస్ ప్రభుత్వమని పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం అశ్వాపు రంలోని ఎస్‌కేటీ ఫంక్షన్ హాల్ నందు ఇందిరా మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. మందుగా అశ్వాపురం ఏపీఎం జ్యోతి మాట్లా డుతూ గ్రామ సమాఖ్యలు 53 ఉన్నాయని మండలంలోని ప్రతి మహి ళకు చీర అందించాలని బొట్టు పెట్టి చీర అందించాలని మొబైల్‌లో నమోదు చేయాలని, ఇది ప్రభుత్వ ఆదేశాలని తెలిపారు. అనంతరం ఎంపీవో ముత్యాలరావు మాట్లాడుతూ 6450 మందికి చీరలు పంపిణీ చేయాలని ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి మహిళకు బొట్టు పెట్టి చీర పంపిణీ కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలన్నారు. ఒక మహిళా ఇందిరాగాంధీ భారతదేశ ప్రధాని అయ్యారని, ఘరీబి హటావో అన్న నినాదంతో కాంగ్రేస్ ప్రభుత్వం ప్రజ లలో మమేకమైందన్నారు. ప్రపంచంలోనే మహిళల గౌరవం పెంచిన ఇందిరా గాంధీ అన్నారు. ఇందిరా గాంధీ పుట్టిన రోజునే మహిళలకు గౌరవంగా పుట్టింటి చీర ఇవ్వాలన్న నిర్ణయం ముఖ్యమంత్రి తీసుకో వడం ఆనందకరమన్నారు. భారతదేశం కోసం ప్రాణ్యత్యాగం చేశారని, ఆమెను ప్రతి ఒక్కరు ఉక్కు మహిళని అంటారన్నారు. ఆమె జన్మదిన సందర్భంగా ఈ చీరల పంపిణీ కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందన్నారు. ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రేస్ ప్రభుత్వానికే దక్కుతుంద న్నారు. తొలి విడతగా అశ్వాపురంలో 719 ఇందిరమ్మ ఇల్లు ఇచ్చామ న్నారు. ఇల్లు మంజూరు నిరంతరం ప్రక్రియ అని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లకు ఐదు లక్షలు ఇస్తున్న ఘనత కాంగ్రెస్‌కు దక్కుతుందన్నారు. ఈ పథకం భారతదేశంలో ఎక్కడ లేదన్నారు. మండలంలో వడ్డీలేని రుణాలు 698 మందికి ఒక కోటి తొంభై లక్షలు ఇచ్చామన్నారు. వడ్డీ లేని రుణాల ద్వారా మహిళలు ఆర్ధికంగా నిలదొక్కుకొని బలపడాలని, కాంగ్రేస్ ప్రభుత్వం మహిళలకు చేయూత నందిస్తుందని, మహిళలు ఆర్థికంగా నిలబడాలనే కాంగ్రేస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇస్తున్న చీరలు చాలా నాణ్యమైన చీరలు అని మహిళలు సంతోషం వ్యక్తం చేస్తు న్నారన్నారు. ఈకార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయ కులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# దేశ స్థాయికి కారేపల్లి కేజీబీవీ పాఠశాల

**-ఖాన్ అకాడమీ సదస్సులో పాల్గొన్న పాఠశాల ప్రత్యేక అధికారిని ఝాన్సీ సౌజన్య**





ప్రజాపక్షం/కారేపల్లి: కారేపల్లి మండల కేంద్రంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపల్ జి ఝాన్సీ సౌజన్య ఖాన్ అకా డమీ ఆధ్వర్యంలో దేశ రాజధాని ఢిల్లీ నగరంలో శనివారం నిర్వహిం చిన సదస్సుకు హాజరయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి విద్యా ర్థినీ, ప్రపంచ స్థాయి విద్యను ఉచితంగా అందించాలనే లక్ష్యంతో స్థాపించబడిన లాభాపేక్ష లేని సంస్థ ఖాన్ అకాడమీ(డిజిటల్ లెర్నిం గ్)ఈ విద్యా సంవత్సరం నుండి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లో ప్రవేశపెట్టారు. ఈ పాఠశాలలను అంతర్జాతీయ విద్యను అందించే ఒక ఉన్నత నాణ్యత విద్యాలయాలుగా రూపొందించడమే కాకుండా, ఇంట ర్నేషనల్ బాకలరేట్(ఐబి), పాఠ్యాంశాలకు అనుగుణంగా నైతిక విలు వలు, నాయకత్వం, సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచనలను పెంపొందించడం ఈ సంస్థ ఉద్దేశం. ఈ అకాడమీలో ఆధునిక సౌక ర్యాలు, విభిన్న విద్యా కార్యక్రమాలు, రెసిడెన్షియల్ విద్య కూడా అందుబాటులో ఉన్నాయి. అత్యున్నత ప్రమాణాలతో, నిపుణులచే సృష్టించబడిన ఖాన్ అకాడమీ యొక్క విశ్వసనీయమైన పాఠాలు, అభ్యా సాలు, సైన్సును, గణితాన్ని ఆసక్తికరంగా కవర్ చేస్తాయి. వీటన్నింటినీ విద్యార్థులు ఉచితంగా ఉపయోగించుకోవచ్చు అయితే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నా కేజీబీవీలలో గడిచిన ఆరు నెలల కాలంలో ప్రగతి నివే దికను చూడగా మూడు పాఠశాలలు ఎంపిక కాగా అందులో కారేపల్లి కేజీబీవీ రాష్ట్ర స్థాయిలో 100శాతంతో మొదటి స్థానంలో నిలిచింది. దీంతో ఢిల్లీలో ఏర్పాటు చేసిన సదస్సుకు ఎస్ఓ ఝాన్సీ సౌజన్యని ఆహ్వానించి సన్మానం చేసి సత్కారం అందజేశారు.

# సీతారామ మట్టి పాల్వంచలో ప్రత్యక్షం..!

**- గోరంత అనుమతులు.. కొండంత తరలింపు**
**- పట్టించుకోని అధికారులు**



ప్రజాపక్షం/పాల్వంచ : పాల్వంచ వ్యాప్తంగా ఇసుక, మట్టి దోపిడి జరుగుతున్నది. ఏచిన్న అవకాశాన్ని వదలకుండా దందా సాగిస్తున్నా రు. అడ్డుగోలుగా దోచుకొన్న సొమ్ముతో అధికారు లను మచ్చికచేసుకొం టూ దొంగలు దొంగలు కలిసి ఊర్లు పంచుకొన్న చందాన ఓముఠా మట్టి, మరో ముఠా ఇసుక దోపిడి చేస్తున్నారు. సీతారామ ప్రాజెక్టు కా లువ మట్టికి దొంగలు పడు తున్నారు. కిన్నెరసాని పరీవాహక ప్రాంత గ్రామాలైన రంగా పురం, నాగారం, దంతెలబోర, బూర్గంపాడు మం డలం పినపా కపట్టినగర్ ల నుండి ఇసుక తోడేస్తున్నారు. రాత్రి పగలు తేడాలే కుండా దోచుకుపోతున్నారు. గత నాలుగు నెలల నుండి దోపిడి చేస్తున్న మట్టి పాల్వంచలో ప్రత్యక్షమవుతున్నది. పాల్వంచ పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాలలో పలు నిర్మాణాలు జోరుగా సాగుతున్నా యి. దీనిని ఆసరాగా చేసుకొన్న అక్రమార్కులు ప్రతిరోజు రాత్రి పగలు తేడా లేకుండా వందలాది టిప్పర్ల మట్టిని పాల్వంచకు తరలిస్తున్నారు. అనుమతుల పేరుతో విచ్చలవిడిగా దోపిడి చేస్తున్నారు. అధికారుల నుండి తీసుకున్న అనుమతులను అడ్డం పెట్టుకొని నాలుగు నెలలుగా మట్టి దందా సాగిస్తున్నారు. పాల్వంచ, బూర్గంపాడు మండలాలకు చెందిన కొందరు వ్యక్తులు కలిసి అక్రమ మట్టి తోలకాల దందాకు తెర లేపారు. సీతారామ ప్రాజెక్టు అధికారుల నుండి అనుమతులు తీసుకొా న్నామంటూ బుకాయిస్తున్నారు. తీసుకొన్న అనుమతులు గోరంతగా ఉంటే కొండంత తవ్వకాలు చేస్తూ ప్రభుత్వ ఆదాయాన్ని దిగమింగుతు న్నారు. తమ రాజకీయ పలుకుబడితో ఎటువంటి ఆటంకాలు లేకుండా దందా కొనసాగిస్తున్నారు. వారి అక్రమాలకు అడ్డుతగిలిన అధికారు లకు మామూళ్ళు ముట్టజెపుతూ ఆర్థిక పలుకుబడితో దారికి తెచ్చుకొం టున్నారని, దీనితోనే అధికారులు పట్టించుకోవటం లేదనే అరోపణలు వ్యక్తమవుతున్నాయి. బూర్గంపాడు మండలం జింకలగూడెం సమీ పంలో గల సీతారామ ప్రాజెక్టు కాలువ మట్టిని జేసిబి లాంటి భారీ యంత్రాల సహాయంతో తోడేస్తూ ప్రతిరోజు వందల టిప్పర్ల మట్టిని విచ్చలవిడిగా రవాణా రవాణా చేస్తున్నారు. ఒక్కో టిప్పర్‌కు 5 వేయిల నుండి అవసరాన్ని బట్టి ఆపై ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకొంటు న్నారు. పెద్ద మొత్తంలో వెనకేసుకొంటూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సీతారామ మట్టి తోలకాలపై దృష్టిసారించి అక్రమ పర్వంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుకొనుచున్నారు. విషయంపై సీతారామ ప్రాజెక్టు ఏఈఈ గణేష్ వివరణ కోరగా ఎటువంటి అనుమతులు లేవని తెలిపారు. అనుమతుల కోసం ధరఖాస్తు చేసుకొన్నారని చెప్పారు.

## పుట్టపర్తి సాయిబాబా జన్మదిన వేడుకలు



ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురం తహసీ ల్దార్ కార్యాలయంలో పుట్టపర్తి సాయిబాబా జన్మదిన వేడుకలను డిప్యూటీ తహసీల్దార్ అనూ ష ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సత్యసాయి బాబా 23 నవంబర్ 1926 ఆంధ్రప్రదేశ్‌లోని పుట్టపర్తి(అ నంతపురం జిల్లా)లో జన్మించారని, సత్యసాయి బాబా భారతదేశానికి చెందిన ప్రసిద్ధ ఆధ్యాత్మిక గురువు, మహానుభావుడిగా లక్షలాది మంది భక్తుల ఆరాధన పొందారని తెలిపారు. ఆయ న ప్రధానంగా సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస లాంటి విలువలన అనుసరించి జీవించాలని పునరుద్ఘోదించారని, పుట్టపర్తిలోని సత్యసాయి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, పేదలకు ఉచిత వైద్యం, ఉచిత విద్య సంస్థలు, పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాల యంలు నెలకొల్పారని, ప్రపంచ నలుమూలల నుండి భక్తులు వచ్చి దర్శనం చేసుకునే ప్రశాంత నిలయమని అన్నారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ లీలావతి, రెవెన్యూ సిబ్బంది, తది తరులు పాల్గొన్నారు.

## ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పుట్టినరోజు వేడుకలు



ప్రజాపక్షం/అశ్వాపురం: సుప్రీం స్వేరో డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పుట్టిన రోజు సందర్భంగా అశ్వాపురం మండ లంలో మానవీయ వృద్ధాశ్రమం ఆరిఫా రోషిని వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి ఆశ్రమంలో ఉన్న వారందరికీ పండ్లు బ్రెడ్డు అందజేశారు. ఈ సందర్భంగా స్వేరో మండల అధ్యక్షులు నాగరాజు మాట్లాడుతూ ప్రవీణ్ ఎంతో మంది కడు పేదరికంలో ఉన్న విద్యార్థు లకు తమకు తమ శక్తిని పరిచయం చేసి ఎవరు ఎవరి కంటే తక్కువ కాదు అని చెప్పి తమలో ఉన్న నిఘాడమైన శక్తిని బయటకు తీసి ఎల్లలు దాటించినా ఓ జ్ఞాన సంపదని, మేము చూస్తున్న ఒక మంచి బుద్ధుడు తన కోరిక ప్రతి ఒక్కరికి కావాల్సింది ఆరోగ్యం ఆర్థి కంగా ఆత్మగౌరవంగా బ్రతకాలని కోరుకుంటు అనంతరం జై స్వేరో, జిఆర్ఎస్‌పి నినా దాలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు యజ్ఞేష్, హర్షిత్, పవన్, సిద్ధు, రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

## నూతన జంటను ఆశీర్వదించిన మాజీ ఎంఎల్ఏ రాములు నాయక్



ప్రజాపక్షం/కారేపల్లి:మండల పరిధి లోని గుంపెళ్ళగూడెం గ్రామానికి చెం దిన తిప్పారపు వీరబాబు, రమాదేవిల కుమార్తె ఐశ్వర్య అవినాష్‌ల వివాహ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి మాజీ వైరా శాసన సభ్యులు లావుడియా రాములు నాయక్ ఆదివారం నూతన జంటను ఆశీర్వదించి శుభా కాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో అజ్మీర వీరన్న, మంద రాము, చిప్పలపల్లి శ్రీనివాస రావు, ఎర్రబెల్లి రాము, పాటమ్మ నాగేంద్రబాబు, అందే స్వామి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికి ఇందిరమ్మ చీరలు పంపిణీ



ప్రజాపక్షం/ఏన్కూరు : మండల పరిధి లోని రేపల్లెవాడ గ్రామంలో ఇందిరమ్మ చీరలు పంపిణీ కార్యక్రమం యూత్ కాంగ్రేస్ అధ్యక్షుడు నిమ్మల నాగేశ్వర రావు ఆధ్వర్యంలో ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రేస్ నాయకులు మాట్లాడుతూ, కాంగ్రేస్ హయాంలో పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. తెలంగాణలో కాంగ్రేస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదలకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు, సన్న బియ్యం ఇచ్చిన ప్రభుత్వం కాంగ్రేస్ కాంగ్రేస్ ప్రభుత్వ మేనని కొనియాడారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో పేద ప్రజలకు ఎటువంటి న్యాయం జరగలేదని అన్నారు. అజ్మీర సురేష్ నాయక్, నిమ్మల నరేందర్, చిన్న స్వామి, సామేలు, శాంతారావు, ప్రకాష్, విజయరావు, గ్రామ కాంగ్రేస్ కార్యకర్తలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సిసి రోడ్లను ప్రారంభించిన పాయం



ప్రజాపక్షం/కరకగూడెం: కరకగూడెం మండలం రేగళ్ల గ్రామపంచాయతీలో 5 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్లను పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దే శించి ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పది ఏళ్లలో ఇవ్వని రేషన్ కార్డులు ఇందిరమ్మ ప్రభుత్వం రాగానే అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజూరు చేసి ఒక్కరికి ఆరు కేజీల సన్నబియ్యాన్ని అందిస్తున్న ప్రభుత్వం కాంగ్రేస్ ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కాంతారావు, ఎంపిఓ భారతి, ఎంఈఓ మంజుల, ప్రభుత్వ అధికారులు మండల అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, కాంగ్రేస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా పరిపుష్టి సాధించాలి



**-18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు చీర పంపిణీ**
**-ఇందిరమ్మ చీర పంపిణీ చేసిన కలెక్టర్**



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** మహిళలు ఆర్థికంగా బలోపేతమైతే కుటుంబాలు బాగుపడతాయని మహిళల ఆర్థిక పరిపుష్టికి ప్రభుత్వం పటిష్ట కార్యాచరణ చేపట్టిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఖమ్మం రూరల్ మండలం బైపాస్ రోడ్డులో టిసివి ఫంక్షన్ హాల్‌లో పాలేరు నియోజక వర్గం నాలుగు మండలాల సహాయక సంఘాల మహిళలకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డితో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదివారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని మొదటి విడత గ్రామీణ ప్రాంతాల్లో ప్రారంభించామని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టిందని ప్రతి ఒక్కరికి చీర తప్పకుండా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం తరుపున ఇందిరమ్మ చీరలు ఇంటింటికి వెళ్లి అందజేయాలన్నారు. పెట్రోల్ పంప్, సోలార్ విద్యుత్ ప్లాంట్, ఆర్టిసికి అద్దె బస్సుల ఏర్పాటు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఇందిరమ్మ క్యాంటీన్లు ఏర్పాటు వంటి అనేక వ్యాపార అవకాశాలను మహిళా సంఘాలకు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. పాలేరు నియోజక వర్గంలో అర్హులైన 53వేల మంది మహిళలకు చీరలు సజావుగా పంపిణీ చేసేవిధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డివో సన్యాసయ్య, మద్దులపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ హరినాథ్ బాబు, తహసీల్దార్‌లు రాంప్రసాద్, విల్సన్, వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సుగుణమ్మకు నివాళులర్పించిన సిపిఐ నేతలు



**ప్రజాపక్షం/ చింతకాని :** ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నాగులవంచ గ్రామానికి చెందిన భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ సభ్యురాలు, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వంకాయలపాటి సుగుణమ్మకు సిపిఐ నేతలు నివాళులర్పించారు. ఆదివారం నాగులవంచ గ్రామంలో సుగుణమ్మ దశ దిన కర్మల్లో సిపిఐ నాయకులు పాల్గొని ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ సుగుణమ్మ భర్త వంకాయలపాటి సీతయ్య సుదీర్ఘకాలం పాటు సిపిఐ పార్టీ నాయకునిగా పని చేశారన్నారు. తుదిశ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీ సభ్యురాలిగా సుగుణమ్మ కొనసాగారన్నారు. జాతీయ మహిళా సమాఖ్య జిల్లా నాయకురాలిగా కొన్ని దశాబ్దాల కాలం పాటు వివిధ హోదాల్లో పని చేశారన్నారు. ఆమె కుమారుడు వంకాయలపాటి సత్యనారాయణ సిపిఐ నుంచి ఎంపిటిసిగా పనిచేశారన్నారు. సుగుణమ్మ మృతితో నిబద్ధత గల కమ్యూనిస్టును కోల్పోయామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు, ఏపూరి రవీంద్రబాబు, కూచిపూడి రవి, మాజీ ఎంఎల్‌ఎ కొండబాల కోటేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు అంబటి వెంకటేశ్వర్లు, సిపిఐ మండల నాయకులు గుడిపూడి మాధవరావు, బైరబోయిన హన్మంతరావు, తుళ్లూరు ప్రసాద్, తాళ్లూరి యాదగిరి, బిఆర్‌ఎస్ నాయకులు మంకెన రమేష్, నెల్లూరి రమేష్, చిలువేరు సైదులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో ఇందిరమ్మ చీరల పంపిణీ





**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా ప్రభుత్వం మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టింది. ఆదివారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. రఘునాథపాలెం గ్రామంలో చీరల పంపిణీ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, సొసైటీ ఛైర్మన్ తాతా రఘురాం, పలువురు నాయకులు పాల్గొని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వి. వెంకటాయపాలెం గ్రామంలో చీరల పంపిణీ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, పంచాయతీ కార్యదర్శి కృష్ణ పాల్గొని చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎంసి ఛైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం పుట్టింటి సారె మాదిరిగా ప్రతి ఒక్క మహిళకు ఇందిరమ్మ చీరల పంపిణీ చేపట్టిందన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు పలు కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుతుంబాక సీతారాం, కిషోర్, వీరు నాయక్, శ్రీనివాస్, ఆదాం, పలువురు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామదీపికల కంట కన్నీరు?

**-ఏపిఎం పనితీరుపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు?**
**-వచ్చిన కొద్ది రోజులకే విమర్శలు?**




**ప్రజాపక్షం/వైరా:** వైరాలోని దేవిశ్రీ మండల మహిళా సమాఖ్య సమావేశంలో గ్రామదీపికలు కన్నీరుతో మున్నీరు అవుతున్నట్లు సమాచారం. ప్రతి సమావేశంలో గ్రామదీపికలు ఎందుకు కంటనీరు పెడుతున్నారు. మహిళలకు ఇచ్చే గౌరవం ఇదేనా, ఆ ఉద్యోగి ఎందుకు వారి కంట పదేపదే కన్నీరు పెట్టేందుకు కారణమవుతున్నాడు. ఎవరికి చెప్పుకోలేక మనోవేదనకు పలువురు గ్రామదీపికలు గురవుతున్నట్లు సమాచారం. వైరా దేవిశ్రీ మండల మహిళా సమాఖ్య ఏపిఎంగా రాంబాబు బాధ్యతలు చేపట్టిన కొద్దిరోజులకే గ్రామదీపికలు పలువురు ఇబ్బందులు పడుతున్న తీరు ఇప్పుడు వైరాలో చర్చనీయాంగా మారింది. గ్రామదీపికలకు సమస్య ఉంటే ఏదైనా సమస్యపై మాట్లాడి దాని పరిష్కారానికి కృషి చేయాల్సిన అధికారి ఎందుకు సమావేశాల్లో పలువురు మహిళలను కన్నీరు కార్చేందుకు కారణం అవుతున్నాడు. జిల్లా అధికారి అయిన పిడి ఒక్కసారి వైరాలోని దేవిశ్రీ మండల మహిళా సమాఖ్య గ్రామ దీపికలో ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. విచారణ చేపడితే వాస్తవాలు బయటకు వస్తాయి. మహిళలను గౌరవించడం మన సంప్రదాయం, మహిళల పట్ల మనం ఒక ప్రత్యేకమైన గౌరవంతో ఉండాలి. అది ప్రభుత్వ ఉద్యోగులైన సామాన్య ప్రజలైన సరే బాధ్యత గల విధుల్లో ఉండి మహిళలు కన్నీరు కు కారణం ఎందుకు అవుతున్నారు. ఎక్కడ తప్పు జరుగుతుంది. తప్పు జరిగితే తప్పు జరిగిన వారిని నిలదీయాలి. కాని పది మందిలో వారు ఇబ్బంది పడేవిధంగా మాట్లాడకూడదు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే రాందాస్ నాయక్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఇప్పటికైనా జిల్లా అధికారులు జోక్యం చేసుకొని వైరాలోని దేవిశ్రీ మండల మహిళా సమాఖ్యలో ఏం జరుగుతుందో అనే దానిపై విచారణ చేపడితే వాస్తవాలు బయటకు వస్తాయి.

# ఇందిరమ్మ చీరలు పంపిణీ



**ప్రజాపక్షం/చింతకాని :** మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో మహిళలకు కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ చీరలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాత్కేపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ అంబటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ప్రభుత్వం రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు వడ్డీ లేని రుణాలతో పాటు ఆర్టిసిలో ఉచిత బస్సు, పెట్రోల్ బంక్‌ల నిర్వహణ, సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు, స్త్రీ టీ స్టాల్స్, అమ్మ ఆదర్శ పాఠశాల నిర్వహణ తదితర కార్యక్రమాలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ బందెల నాగార్జున, కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు తోటకూరి ప్రగతి, నాయకులు తోటకూరి హరీష్, మండేపూడి కిషన్‌రావు, తాళ్లూరి రమేష్, మధిర సోషల్ మీడియా కో ఆర్డినేటర్ అనిల్ కుమార్ వేర్పుల, మెట్టెల కృష్ణ, వజ్రాల వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, గ్రామ దీపిక కాసిమల గీత, మహిళలు పాల్గొన్నారు.

# పలువురిని పరామర్శించిన కాగ్రెస్ నాయకులు





**ప్రజాపక్షం/వైరా:** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులో ఇటీవల మరణించిన మూడుముంతల చిన్న కోటయ్య, పెద్ద కోటయ్య తల్లి అప్పమ్మ దశదిన కర్మ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ రాష్ట్ర మాజీ మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, పిసిసి ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బోళ్ళ గంగారావు, అప్పమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అదేవిధంగా ఆ వార్డులో అనారోగ్యంతో బాధపడుతున్న మూడుముంతల బుజ్జిని వారు పరామర్శించారు. పరామర్శించిన వారిలో తోటకూర గోపి, గొలుసు నాగరాజు, రాచబంటి రామకృష్ణ, గొలుసు వెంకన్న , మూడుముంతల సైదులు, తోటకూర వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నగర అధ్యక్షునిగా దీపక్ చౌదరి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షులుగా నాగండ్ల దీపక్ చౌదరి నియమితులయ్యారు. రాష్ట్రంలో పలు జిల్లాలలకు కాంగ్రెస్ అధ్యక్షుల నియామకంతో పాటు ఖమ్మం నగర కాంగ్రెస్ అధ్యక్షున్ని కూడా నియమించింది. కాంగ్రెస్ నగర అధ్యక్షునిగా ఎన్నికైన నాగండ్ల దీపక్ చౌదరికి సౌమ్యుడిగా, పార్టీలో అజాతశత్రువుగా పేరుంది. అన్ని వర్గాల నాయకులతో సత్సంబంధాలు ఉన్నాయి. మొదటి నుంచి కాంగ్రెస్ పార్టీ వీర విధేయుడిగా చురుకైన కార్యకర్తగా పనిచేశారు. ఖమ్మం కార్పోరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ నుంచి కార్పొరేటర్‌గా పని చేశారు. ఖమ్మం నగర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్న నాగండ్ల దీపక్ చౌదరిని నగర అధ్యక్షునిగా ప్రకటించారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని దీపక్ చౌదరి తెలిపారు. దీపక్ చౌదరి నియామకం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

# సూర్యలంక బీచ్‌కు ప్రత్యేక బస్సు సర్వీస్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఖమ్మం డిపో నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్లలోని సూర్యలంక బీచ్‌కు ప్రత్యేక డీలక్స్ బస్సు సర్వీస్ ఏర్పాటు చేసినట్లు ఖమ్మం డిపో మేనేజర్ శివప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల కోరిక మేరకు నవంబర్ 30న ఆదివారం ఉదయం ఆరు గంటలకు ఖమ్మం బస్ స్టేషన్ నుంచి డీలక్స్ బస్సు బయలుదేరి సూర్యలంక బీచ్‌కు చేరుకుంటుందని మరల సాయంత్రం ఆరు గంటలకు బీచ్ వద్ద నుండి బయలుదేరి ఖమ్మం చేరుకుంటుందని తెలిపారు. ఇట్టి ప్రయాణానికి సంబంధించి పెద్దలకు రూ.1,000, పిల్లలకు రూ.530 ఛార్జీ ఉంటుందని తెలిపారు. పూర్తి ట్రిప్ తీసుకెళ్లి తీసుకొచ్చేవిధంగా ఉంటుందన్నారు. ఇట్టి అవకాశాన్ని ఖమ్మం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9136446666 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

# జన సేవాదళ్ శిక్షణ శిబిరంకు సన్నద్ధం చేసుకోవాలి




**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు విట్టల్ రావు కార్యాలయంలో ఆదివారం జన సేవాదళ్ శిక్షణ శిబిరం ఏర్పాటు కోసం నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే సారయ్య పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వందేళ్ళ ముగింపు ఉత్సవాలను డిసెంబర్ 26న ఖమ్మంలో ఐదు లక్షల మందితో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేయబోతున్నామని, దాని కొరకు జన సేవాదళ్ శిక్షణ శిబిరం ఏర్పాటు చేసి వారికి శిక్షణ ఇచ్చేందుకు ముందుగా ఇల్లందు పట్టణ, మండల నుండి ప్రతి శాఖ నుండి యువకులను సన్నద్ధం చేయాలని ఇక్కడ శిక్షణ తీసుకున్న తర్వాత డిసెంబర్ 26న జరిగే కవాతులో ఈ జన సేవాదళ్ కార్యకర్తలు పాల్గొనే విధంగా ప్రతి ఒక్కరు బాధ్యత వహించి ఈకార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, పట్టణ కార్యదర్శి బాస శ్రీనివాసరావు, మండల కార్యదర్శి బొప్పిశెట్టి సత్యనారాయణ, బ్రాంచ్ కార్యదర్శి నజీర్ అహ్మద్, సహాయ కార్యదర్శి దాసరి రాజారాం, మహిళ సమైక్య పట్టణ కార్యదర్శి విజయలక్ష్మి, ఏఐవైఎఫ జిల్లా అధ్యక్షులు ఉమ్మగాని హరీష్, బొల్లి కొమరయ్య, సుందర్, చాట్ల గణపతి, సాంబమూర్తి, వలి, ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి ఈర్ల రవి, వెంకటేశ్వర్లు, మామిడి రవి, భాస్కర్, ఆలపు రాఘవేంద్రరావు, జక్కుల కనకయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శం

## -ఆడబిడ్డల సంక్షేమం ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యం -ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు





**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సంక్షేమ పథకాల అమలులో దేశానికే ఆదర్శంగా తెలంగాణ ప్రజా ప్రభుత్వం నిలుస్తుందని పినపాక ఎంఎల్ఏ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం బూర్గంపాడు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జములారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన మహిళా ఉన్నతి, తెలంగాణ ప్రగతి ఇందిర మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం, కళ్యాణ లక్ష్మి , షాదీముబారకర్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈసందర్బంగా ఆయన ఆడబిడ్డల సంక్షేమం ప్రజాప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని, ఇప్పటికే ఆడబిడ్డలకు వరంగా పలు సంక్షేమ పథకాలు అందించామని అన్నారు. దేశ అభివృద్ధికి ఇందిరాగాంధీ చేసిన సేవలను గుర్తు చేశారు. అందుకే ఆమె జయంతి సందర్భంగా తెలంగాణ ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిరిసిల్ల చేనేత చీరలనీ రాష్ట్ర వ్యాప్తంగా ఆడబిడ్డలకు అందించేందుకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని రెండు సంవత్సరాల వ్యవధిలలోని ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని అన్నారు. మహిళల సంక్షేమమే లక్ష్యంగా తొలిత ప్రారంభించిదని పథకం ఉచిత ఆర్టీసీ ప్రయాణం అని పేర్కొన్నారు. ఉచిత విద్యుత్, ఉచిత గ్యాస్ పంపిణీ వంటి పథకాలు ఇప్పటికే అమలవుతున్నాయని తెలిపారు. ప్రతి పేదొడి ఇంటికల నెరవేర్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మొదటి దఫాలో ఇప్పటికే పలువురు ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకున్నారని రాబోయే రోజుల్లో మరిన్ని ఇందిరమ్మ ఇల్లు కట్టించి ఇస్తామని దళారులు మాట నమ్మి మోసపోవద్దని అని మరో సారి తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు రానివారు నేరుగా తనని కలవాలని అధికారుల ద్వారా ఎంక్వయిరీ చేయించి అర్హులై ఉంటే తప్పకుండా ఇల్లు తప్పించే బాధ్యత నాదని భరోసా ఇచ్చారు. ఇంటింటికి సన్న బియ్యం అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని తెలిపారు. గత పది సంవత్సరాలలో గత ప్రభుత్వం నూతన రేషన్ కార్డులు ఇవ్వలేదని మన ప్రభుత్వం వచ్చిన రెండు సంవత్సరాల లోనే అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందించామని ఇంకా కావలసిన వారు ఎవరైనా ఉంటే తహసీల్దార్‌కి అప్లికేషన్ పెట్టుకోవాలని సూచించారు. ఆడబిడ్డలకు చీరలు అందించడం ఆనందంగా ఉందన్నారు. మండల వ్యాప్తంగా 12,195 మంది డ్వాక్రా మహిళా సభ్యులు ఉన్నారని మొదటి దఫాలో 9840 చీరలు మండలానికి చేరాయని ప్రతి గ్రామంలోని డ్వాక్రా గ్రూపు సంఘాలకు చేరాయని ప్రతి గ్రామంలోని డ్వాక్రా గ్రూపు సంఘాలకు వారి వివోలే ద్వారా ప్రతి ఇంటికి చీరలు అందిస్తారని తెలిపారు. మొదటి దఫాలో రానివారికి రెండవ దఫాలో చీరలు అందించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మండలంలోని ప్రతి గ్రామం నుండి ఒక్కొక్క వివోఏ సభ్యురాలిని పిలిచి చీరలను పంపిణీ చేశారు. మండలంలోని 32 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్షమీ, షాదీముబారక్ చెక్కులు అందించారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ కెఆర్‌కె ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షులు దుగ్గెంపూడి కృష్ణారెడ్డి, జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహమూద్ ఖాన్, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ భజన సతీష్ కుమాన్, ఏపీఎం హేమంతిని, మహిళా సమాఖ్య మండల అధ్యక్షులు రాజశ్రీ, కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు మందా నాగరాజు, నాయకులు చల్లా వెంకటనారాయణ, పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, భజన ప్రసాద్ కుమార్, సారెడ్డి అశోక్‌రెడ్డి, శనగ కిషోర్, సత్తి పండు, మాజీ ఉపసర్పంచ్ శనగ ప్రత్యూష, యువజన మండల అధ్యక్షులు నిమ్మల హరీష్ యాదవ్, ఇంగువ రమేష్, దాసరి సాంబ, భాస్కర్‌రావు, వెంకట్రాంరెడ్డి, ప్రభాకర్, కార్యకర్తలు, సీసీలు తులసి, రాంబాబు, సునీత, ఆర్‌ఐలు నరసింహారావు, వీరరాజు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా నిలిచే ఏకైక పార్టీ కాంగ్రెస్

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎంఎల్ఏ కోరం



**ప్రజాపక్షం/ఇల్లందు:** ఇల్లందు పట్టణ, మండలానికి చెందిన బాధితులకు ఆదివారం క్యాంప్ కార్యాలయంలో ఎంఎల్ఏ కోరం కనకయ్య సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రెండు సంవత్సరాల ప్రజా ప్రభుత్వ కాలంలో 8 కోట్ల విలువైన సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఇల్లందు నియోజకవర్గంలో పంపిణీ చేశామని అన్నారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి హయంలో పేదల వైద్యం చేయించుకుంటే వారికి ఆర్ధికంగా నిలిచేందుకు ఈ చెక్కుల పంపిణీ కార్యక్రమం ప్రారంభించారని గుర్తు చేశారు. గత పాలకులు హయంలో రేషన్ కార్డు ఊసే లేదని ప్రజా ప్రభుత్వంలో పేదలందరికి రేషన్ కార్డులు అందించామని అన్నారు. ఈ దేశంలో పేదలందరికి అండగా నిలిచే పార్టీ బడుగులకు బలహీనులకు అసరాగా నిలిచే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని తెలిపారు. పేదలందరికి వైద్యం ఖర్చు 10లక్షల అయిన వారికి ఎల్‌ఓసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అర్హులైన అందిరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ళు, ఉచిత బస్సు, ఉచిత విద్యుత్, 500 రూ గ్యాస్ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోత్ రాంబాబు, ఇల్లందు మండల మాజీ వైస్ ఎంపీపీ మండల రాం మహేష్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ యదలపల్లి అనసూర్య, నాయకులు పూనెం సురేందర్, తాటి బిక్షం, మూతి కృష్ణ, మడుగు సాంబమూర్తి, చిల్లా శ్రీనివాస్, పోట్ రవి, మాజీ సర్పంచులు కల్తి పద్మ, పాయం స్వాతి, నాయకురాలు బానోత్ శారద, మోకాళ్ళ వెంకటమ్మ, తాటి రాంబాబు, జోగా శ్రీకాంత్, బొల్లి రామారావు, అరెం కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ కార్మికులకు లేబర్ కోడ్‌లపై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/ఇల్లందు** : సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా జియం కృష్ణయ్య ఆదేశానుసారం ఆదివారం జియం కార్యాలయంలో కాంట్రాక్ట్ లేబర్ కోడ్స్ గురించి ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా యాక్టింగ్ జియం గోవిందరావు, యస్ఓటు జియం డి రామస్వామి పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కార్మిక చట్టాలను సరళీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఉన్న 40కు పైగా లేబర్ లాస్‌ను సమగ్రీకరించి నాలుగు ప్రధాన లేబర్ కోడ్స్‌గా ప్రకటించిందని, ఈ నూతన కోడ్స్ అమల్లోకి రావడం ద్వారా కార్మికుల హక్కులు, భద్రత, వేతన వ్యవస్థ పారదర్శకత మరింత బలోపేతం కానున్నాయి. సింగరేణి పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు కూడా ఈమార్పులు వర్తించనున్నాయని తెలిపారు. ఈ నాలుగు కోడ్స్ 1 వేతన కోడ్, 2 పారిశ్రామిక సంబంధాల కోడ్, 3 సామాజిక భద్రతా కోడ్, 4 ఓఎస్‌హెచ్ కోడ్, వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితులు సింగరేణి ఉద్యోగులకు ప్రయోజనాలు ఈ నాలుగు లేబర్ కోడ్స అమల్లోకి రావడం ద్వారా సింగరేణి ఉద్యోగులు వేతనాలు, సేఫ్టీ, సోషల్ సెక్యూరిటీ, యూనియన్ హక్కుల రంగాల్లో మరింత పారదర్శకమైన, సులభతరమైన, బలమైన వ్యవస్థను పొందనున్నారని అన్నారు.



ఈకార్యక్రమంలో ఏరియా డిజియం(పర్సనల్)అజ్మీర తుకారాం, కేఓసి సేఫ్టీ ఆఫీసర్ యు బ్రహ్మం, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ వి అజయ్, అధికారుల సంఘం అధ్యక్షులు ఎజి శివప్రసాద్, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ నజీర్ అహ్మద్, రాజారామ్, ప్రాతినిధ్య సంఘం ఉపాధ్యక్షులు జె వెంకటేశ్వర్లు, కాంట్రాక్టు ఉద్యోగులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

## - ఎర్త్ యూనిర్సిటీని సందర్శించిన మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం/పాల్వంచ** : డిసెంబర్ 2వ, తేదీన మన్మోహన్‌సింగ్ ఎర్త్ యునివర్సిటీని ప్రారంభానికి వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ఎర్త్ యూనివర్సిటీని తుమ్మల సందర్శించారు. జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. దేశంలో మొట్టమొదటి ఎర్త్ యూనివర్సిటీ కకొత్తగూడెం జిల్లాలో ఏర్పాటు చేశారని అన్నారు. దానికి మాజీ ప్రధానమంత్రి మన్‌మోహన్‌సింగ్ పేరు పెట్టడం మనందరికి గర్వకారణమన్నారు. మరో రెండుసార్లు తిరిగి పరిశీలనకు వస్తానని చెప్పారు. డిసెంబర్ 1 నాటికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి ప్రారంభానికి అన్ని వసతులను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. సిఎం పర్యటనను పండగలాగా పెద్ద ఎత్తున విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ జితేష్‌వి. పాటిల్, ఇల్లందు, భద్రాచలం, వైరా ఎంఎల్ఏలు కోరం కనకయ్య, తెల్లం వెంకటరావు, రాందాస్‌నాయక్, గ్రంథాలయ జిల్లా చైర్మన్ పసుపులేటి వీరబాబు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హరిహర క్షేత్రంలో కోరం ప్రత్యేక పూజలు



**ప్రజాపక్షం/ఇల్లందు:** శ్రీహరి హర క్షేతర అయ్యప్ప స్వామి వారి దేవాలయంలో ఆదివారం ఎంఎల్ఏ కోరం కనకయ్య దంపతులు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల నిర్వహించి మాల ధరించి స్వాములకు బిక్ష వడ్డించారు. దేవాలయంకు విచ్చేసిన ఎంఎల్ఏ దంపతులను ఆలయ అధికారులు శాలువాతో సత్కరించారు. గణేష్ స్వామి కుమారుడి జన్మదినం సందర్భంగా మాలధారులకు అన్నదానం చేస్తున్నందున వారికి ఎంఎల్ఏ అభినందనలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ గందే సదానందం, ఇల్లందు మార్కెట్ కమిటి ఛైర్మన్ బానోత్ రాంబాబు, ఆర్యవైశ్య మహాసభ ఇల్లందు మండల అధ్యక్షులు ప్రొద్దుటూరి నాగన్న, టౌన్ కాంగ్రెస్‌నాయకులు చిల్లా శ్రీనివాస్, ఆలయ అధికారి సూర్య ప్రకాశ్, ఆలయ డైరెక్టర్లు కండె రమేష్, పల్లెళ్ళ చంద్రశేఖర్, పద్మవతి, విజయ, తదితరులు పాల్గొన్నారు.

# సాగర్ కాల్వలో పడి వ్యక్తి గల్లంతు



**ప్రజాపక్షం/ఏన్కూరు** : మండల పరిధిలోని తిమ్మారావుపేట గ్రామానికి చెందిన వ్యక్తి బత్తుల దుర్గాప్రసాద్ (28) గ్రామ సమీపంలోని సాగర్ కాలువలో పడి గల్లంతయిన సంఘటన ఆదివారం జరిగింది. మధ్యాహ్నం మూడు గంటల సమయంలో గాలాలతో చేపలు పట్టేందుకు ఎలక్ట్రిషన్ గా పనిచేస్తున్న దుర్గాప్రసాద్ అతని స్నేహితులు రాయల సురేష్, కాకటి రాజేష్ ముగ్గురు కలిసి గ్రామ సమీపంలోని సాగర్ కెనాల్ వద్దకు వెళ్లారు. రాజేష్, సురేష్ చేపలు పడుతుండగా దుర్గాప్రసాద్ మాత్రం ఈత కొట్టేందుకు సాగర్ కాల్వలోకి దిగాడు. ఈత ఆఒడ్డు కు ఈ ఒడ్డుకు ఒకసారి తిరిగాడు. రెండోసారి మధ్యకు రాగానే ఆయాసంతో ఈత కొట్టలేక మునిగిపోయాడు. పక్కనే చేపలు పడుతున్న స్నేహితుడు సురేష్ గమనించి వచ్చేసరికి అప్పటికే పూర్తిగా మునిగిపోయాడు. ఎంత వెతికినా దొరకలేదు.విషయం తెలుసుకున్న ఎస్సై నారా బోయిన సంధ్య సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# కార్మికులకు ఉరిగా లేబర్ కోడులు




**ప్రజాపక్షం/మణుగూరుః** దేశంలో నయా ఉదారవాద ఆర్థిక విధానాలను కేంద్ర ప్రభుత్వం దూకుడుగా అమలు చేస్తుందని, దాని కారణంగా దేశం ఆర్థిక సంక్షోభంలో పడింది అని, కార్పొరేట్ల ప్రయోజనాల కోసమే కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడలు తీసుకొచ్చిందని, వెంటనే ఉపసంహరించుకోవాలని సెంటర్ ఆఫ్ ఇండియ ట్రేడ్ యూనియన్ సిఐటియు అఖిలభారత కోశాధికారి ఎం సాయిబాబు డిమాండ్ చేశారు. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిఐటియు నాలుగవ మహాసభలు (కిన్నెర కళ్యాణ మండపం )కూకట్ల శంకర్ నగర్ లోని ఎర్ర శ్రీకాంత్ ప్రాంగణంలో కొలగాని కే బ్రహ్మాచారి అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. ముందుగా సిఐటియు సీనియర్ నాయకులు ఎంవి అప్పారావు జెండా ఆవిష్కరించారు. అనంతరం అమరవీరులు కూకట్ల శంకర్, ఎర్ర శ్రీకాంత్ లకు ఎం సాయి బాబు సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బి మధు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాసభకు హాజరైన ప్రతినిధులు అమరవీరుల స్తూపం వద్ద జోహార్లు అర్పిస్తూ గీతాలాపన చేస్తుండగా అమరవీరులకు పూలతో విప్లవ జోహార్లు అర్పించారు. అనంతరం జిల్లా మహాసభలను ప్రారంభించి.. మాట్లాడుతూ దేశంలో 50 కోట్ల కార్మికుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వారి హక్కులను హరించేందుకు మోడీ ప్రభుత్వం ఆ కోడులను తీసుకొచ్చిందని అన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు అన్నవరపు కనకయ్య సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏ జే రమేష్, కే బ్రహ్మాచారి ,ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు నెల్లూరి నాగేశ్వరరావు, రుద్ర నాగరాజు,చిట్టిబాబు సిఐటియు జిల్లా నాయకులు జి పద్మ, ఎం వి అప్పారావు, పిట్టల అర్జున్, గద్దల శ్రీనివాసరావు, ఈసం వెంకటమ్మ ఎస్ ఏ నబి, దొడ్డ రవికుమార్, కే సత్య, బి వెంకట రాజు, నర్సారెడ్డి సోషల్ మీడియా రాష్ట్ర నాయకులు పిట్టల రవి ఆహ్వాన సంఘం కోశాధికారి సత్ర పల్లి సాంబశివరావు సిఐటియు మండల కన్వీనర్ కొడిశాల రాములు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ హెవీ వాటర్ ప్లాంట్ ఎస్ డబ్ల్యూ ఎఫ్ కార్యదర్శి పోతురాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.